


**జరిగిన జగన్నాటకం**

ఎడమచేతిని ప్రముఖంగా వాడే సవ్యలంకలో కుడి చేతిని వాడినందుకు బోసుకు మరణదండన విధించబోయాడు దళాధిపతి. ఆచార్య వేదాంతం, ద్వీప, పశుపాల కలిసి బోసుని కాపాడారు. ఆ ద్వీపాన్ని వదిలి వెళ్ళిపోవాలని ప్రయత్నించి విఫలమయ్యాడు బోసు. భవిష్యజ్ఞాన గ్రంథంలో చెప్పబడిన మహాబసు బోసే అని ద్వీప చెప్పింది. దళాధిపతితో జరిగిన పోరాటంలో జలపతి మరణించాడు. అయిష్టంగానే నాయకత్వాన్ని మహాబసుకి ఇచ్చేశాడు ఉగ్ర. శాంతియుతమైన పోరాటానికి పథకాలు వేస్తున్నాడు మహాబసు.

# -10-

"డాక్టర్ నరసింహం సైక్రియాట్రిస్ట్ అని రాసి వున్న తలుపు తెరుచుకోని బయటికి వచ్చాడు సారధి. రిసెప్షన్ దగ్గర సోఫాలో కూర్చోని వున్న ప్రసాద్ అతన్ని చూస్తూనే లేచి నిలబడ్డాడు.

"ఏమన్నార్రా?" అన్నాడు సారధి దగ్గరకు వచ్చి. గట్టిగా నిట్టూర్చాడు సారధి.

"మొత్తం చెప్పాను. హాలూజినేషన్ అయ్యుండచ్చు అంటున్నారు. మళ్ళీ అలా జరిగితే ఇంకోసారి రావాల్సి వుంటుందట. ఆయనకీ అర్థం అయినట్లు లేదు" అన్నాడు.

"దట్సోకే... వెల్దామా?" అన్నాడు ప్రసాద్. ఇద్దరూ ముందుకు కదిలారు కానీ అక్కడ టేబుల్ మీద వున్న న్యూస్ పేపర్ చూసి ఆగిపోయాడు సారధి.

"మాతృమరణం" అన్న శీర్షిక అతన్ని ఆకర్షించింది. చటుక్కున వంగి పేపర్ అందుకోని ఆ వార్త చదవసాగాడు.

"ఓ కన్న తల్లి, తల్లి కాకముందే కడతేరింది. ఐర్లాండ్ లో జరిగిన ఓ అనూహ్య సంఘటనలో భారత సంతతికి చెందిన కవిత అనే మహిళ ఆ దేశపు చట్టానికి బలైపోయింది. గర్భిణిగా వున్న కవిత గత కొంత కాలంగా యుటిరస్ ఇన్ఫెక్షన్ తో బాధపడుతోంది. కడుపులో వున్న పిండానికి కూడా ఆ ఇన్ఫెక్షన్ సోకడంతో గత రెండు రోజులుగా తీవ్ర రక్తస్రావం జరుగుతోంది. పుట్టబోయే బిడ్డ ప్రాణాలతో మిగిలే అవకాశం సన్నగిల్లడంతో ఆ పిండాన్ని తొలగించాలని స్థానిక డాక్టర్లను కోరింది. అయితే ఐర్లాండ్ చట్టం ప్రకారం క్లినికల్ గా గర్భస్రావం చేయడం నేరమని డాక్టర్లు ఆమె కోరికను నిరాకరించారు. గత గురువారం రాత్రి ఎనిమిది గంటలకు ఇన్ఫెక్షన్ కవిత అవయవాలకు కూడా పాకడంతో ఆమె ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. శరీరంలోని ముఖ్య అవయవాలు క్రమంగా స్పందించడం మానేశాయి. చివరిగా ఆమె గుండె కూడా పని చెయ్యకుండా ఆగిపోవడంతో గత రాత్రి తుది శ్వాస విడిచారు. ఈ విషయమై ఆమె బంధువులు, ఐర్లాండ్ లోని ప్రవాస భారతీయులు అక్కడి చట్టాల పట్ల తీవ్ర నిరసన తెలియజేస్తున్నారు. ఇదే దేశంలో ఇలాంటి చట్టాల వల్ల నష్టపోయిన మరికొంతమంది, వివిధ స్వచ్ఛంద సంస్థలు ఈ సంఘటనపై తీవ్ర వ్యతిరేకత ప్రకటిస్తునారు. ఇది క్రమంగా ఉద్యమ రూపం దాల్చే అవకాశం కనపడుతోంది. కాగా సదరు హాస్పిటల్ డాక్టర్లు తాము తమ దేశ చట్టాన్ని అనుసరించి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలియజేశారు. ఆఖరు నిముషం వరకు కవిత కడుపులో వున్న బిడ్డ గుండె కొట్టుకుంటూనే వుంది కాబట్టి ఆ పిండాన్ని తొలగించడం భ్రూణ హత్య కిందకు వస్తుందని, అది చట్టరీత్యా నేరమని వారు వాదిస్తున్నారు. మృతురాలు కవిత కూడా డాక్టరే కావడం కొసమెరుపు"

"ఏంట్రా ఆగిపోయావు?" అడిగాడు ప్రసాద్. సారధి పేపరులో ఆ వార్త కనపడేలా చూపించాడు.

"చదివాను" అన్నాడు ప్రసాద్ క్లుప్తంగా.

"ఎంత ఘోరం" అన్నాడు సారధి.

"వాళ్ళు మాత్రం ఏం చేస్తారు? పద" అన్నాడు ఆ విషయాన్ని అక్కడే తుంచేయాలని ప్రయత్నిస్తూ.

"మరీ ఇంత దుర్మార్గమైన చట్టం ఎలా పెట్టార్రా? ఒక మనిషి చనిపోతుందని తెలిసినా ఏం చెయ్యకుండా వదిలేయటం అమానుషం కాదా?" అన్నాడు సారధి.

ప్రసాద్ కొన్ని క్షణాలు ఏమీ మాట్లాడకుండా నిలబడ్డాడు. గట్టిగా నిట్టూర్చి "పక్కనే కాఫీడే వుంది. అక్కడ కూర్చుందాం పద" అన్నాడు. ఇద్దరూ బయటికి నడిచారు.

"చట్టం చేసే వారికి మానవత్వమే వుండదా?" అన్నాడు సారధి కాఫీడేలో కాఫీ తాగుతూ. మళ్ళీ ఆ టాపిక్ రావటం ఇష్టం లేనట్లు ముఖం పెట్టాడు ప్రసాద్.

"ఏది అమానుషం?" అన్నాడు కాఫీ సిప్ తాగుతూ.

"ఒక మనిషి ప్రాణాలు కాపాడటానికి అవకాశం ఇవ్వని చట్టాలు" కాస్త కోపం వినపడుతోంది అతని గొంతులో.

"పసిపిల్లల ప్రాణం కాపాడటానికే కదా ఆ చట్టం తయారు చేశారు" ప్రసాద్ నెమ్మదిగా అన్నాడు. గోవాలో ఏదో బేధాభిప్రాయం కారణంగా మొదలైన వాదన గొడవగా మారిన సందర్భం ఆతనికి ఇంకా గుర్తుంది. మళ్ళీ అలాంటి గొడవ మళ్ళీ రాకూడదని అతను శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు.

"తల్లి ప్రాణం పోతుంటే బతుకుతుందో లేదో తెలియని బిడ్డని కాపాడాలని ప్రయత్నించడం ఫూలిష్ గా లేదూ?" అడిగాడతను.

"బతికే అవకాశం వుంటే ఒక ప్రాణిని భూమి మీదకు రాకుండా ఆపడం కూడా పాపమే కదా?" తిరుగు ప్రశ్న వేశాడు.

"అంటే తల్లి ప్రాణం కన్నా బిడ్డ ప్రాణమే ముఖ్యమని అంటున్నావా?"

"నేను అనట్లేదు. అక్కడి చట్టాలు అంటున్నాయి." అని కొద్దిగా ఆగాడు. "నిజానికి ఆ చట్టాల అర్థం అది కూడా కాదేమో. ఒక తల్లి ఈ చట్టం వల్ల చనిపోయిన మాట నిజమే కావచ్చు కానీ దాని వల్ల ఎన్ని బిడ్డల ప్రాణాలు నిలబడి వుంటాయో ఆలోచించు" అన్నాడు.

“ఇలా కొలతలు వేసి ఎంత మంచి జరిగింది, ఎంత చెడు జరిగింది అని తూచి ఆ చట్టం మంచిదా కాదా అని నిర్ణయించడం కరెక్టేనా?” సారధి నెమ్మదిగానే అన్నాడు. అతని మాటల్లో వాదించాలన్న ప్రయత్నం కన్నా చనిపోయిన కవిత పైన సానుభూతి కనపడుతోంది. ఆ విషయాన్ని గమనించిన ప్రసాద్ ముందు ఆశ్చర్యపోయినా చర్చను కొనసాగించాడు.

“ఒక దేశం ఒక చట్టాన్ని చేస్తున్నప్పుడు అది వీలైనంత ఎక్కువమందికి ఉపయోగపడాలని ప్రయత్నిస్తుంది తప్ప, ప్రతి ఒక్కరికీ మంచే జరగుతుందని ఆశించదు. అలా ఆశించడం కూడా కరెక్ట్ కాదేమో. మాగ్జిమమ్ గుడ్ మాత్రమే సాధ్యం, యూనివర్సల్ గుడ్ సాధ్యం కాదు.”

సారధి చాలాసేపు మాట్లాడకుండా వుండిపోయాడు. బేరర్ వచ్చి కాఫీ కప్పులు తీసుకెళ్ళిపోయాడు.

“కవిత చనిపోయి వుండకూడదు అని నీకు అనిపించలేదా?” అన్నాడు సారధి మళ్ళీ చర్చ మొదలుపెడుతూ.

“అనిపించింది”

“మరి అక్కడ ప్రజలకి అనిపించట్లేదా? ఎందుకు ఇలాంటి చట్టాన్ని ఒప్పుకున్నారు?”

“ఏమో... నువ్వు అడుతున్నావని చెప్పడం కాదు కానీ, నాకేమనిపిస్తోందో తెలుసా? మనం వేరు వాళ్ళు వేరు అని.”

“అంటే?” ఆశ్చర్యపోయాడు.

“మన కల్చర్ వాళ్ళ కల్చర్ వేరు. మనం బిడ్డ కన్నా తల్లి ముఖ్యమని ఆలోచించే సమాజం అయితే వాళ్ళు తల్లి కన్నా బిడ్డ ముఖ్యమని అనుకునే సమాజం అయ్యుండచ్చు...” అంటూ మధ్యలో ఆగిపోయాడు.

“అలా కూడా లేదుగా... బిడ్డని కూడా కాపాడలేకపోయారు కదా? ఏమీ చెయ్యకుండా వదిలేసి, ఎలా జరగాల్సి వుంటే అలా జరుగుతుంది అన్నట్లుగా వుంది వాళ్ళ వ్యవహారం” అసహనంగా అన్నాడు సారధి.

“పోనీ అలాగే అనుకుందాం అది మన కర్మ సిద్ధాంతం లాగానే వుంది కదా?”

“మన ప్రయత్నం చెయ్యకుండా మొత్తం దేవుడికే వదిలెయ్యమని ఏ సిద్ధాంతం చెప్పినా అది తప్పే.”

"ప్రయత్నం చెయ్యాలి ఓకే... కానీ ఏ ప్రయత్నం? బిడ్డని కాపాడాలా? తల్లిని కాపాడాలా? ఇదొక ఎథికల్ డైలమా. నువ్వు తల్లి ముఖ్యం అనచ్చు, ఇంకొకళ్ళు బిడ్డ ముఖ్యమని అనచ్చు. అలా అనడం వెనుక వాళ్ళ అనుభవం, వాళ్ళు వున్న సమాజంలో నేర్పించబడిన విలువలు, మతాచారాలు, సంప్రదాయాలు, సంస్కృతి అన్నీ వుంటాయి. ఐర్లాండ్ సమాజ సంస్కృతి వేరు మన సంస్కృతి వేరు" అని ఆపాడు ప్రసాద్.

"ఒక మతంలో ఒక మగవాడు ఇద్దరు ఆడవాళ్ళని పెళ్ళి చేసుకోవడం తప్పు కాదు. మరో మతంలో అభ్యంతరంలేదు. ఇప్పుడు ఈ రెండు విషయాలను ఆయా మతంలో కథల రూపంలో, వ్యవహార శైలిలో, మాటల్లో, ఉదాహరణల్లో పదే పదే ప్రకటిస్తూ వుంటారు. అలా చెప్పుకుంటూ వుంటే ఆ సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆ విషయాల పట్ల ఐక్యత ప్రదర్శిస్తారు. అందుకే ఇద్దరు వేరు వేరు సమాజాలకు చెందిన వ్యక్తుల మధ్యని విబేధం తలెత్తే అవకాశం వుంటుంది. ఒకోసారి రెండు వర్గాల మధ్య, రెండు సమాజాల మధ్య, రెండు దేశాల మధ్య కూడా ఇలాంటి విబేధాలు వస్తుంటాయి. అవన్నీ ఆయా సమాజాలలో, దేశాలలో వుండే వాల్యూ సిస్టమ్ అంటే విలువల వ్యవస్థ మీద ఆధారపడి వుంటాయి." అంటూ ఆపాడు ప్రసాద్. సారధి అతని వైపే తీక్షణంగా చూస్తూ ఆలోచనలో మునిగిపోయాడు.

★★★

"ముఖ్యమైన పనులకి ఎడమ చేతినే వాడాలి అని చెప్పే చట్టాలన్నింటినీ చదివాను. కానీ ఒక సమాజం కేవలం చట్టం ఆధారంగానే తమ వ్యవహార శైలిని నిర్ణయించుకుంటుందని నేను అనుకోను." అని ఒకసారి చుట్టూ చూశాడు మహాబసు. అతను చెప్తున్న ప్రతి మాట తూచ తప్పకుండే పాటించే కీలకసభ్యుల సమావేశం జరుగుతోంది. తాను ఆశించిన ప్రతిస్పందన ఆ సభ్యులలో కనపడటంతో కొనసాగించాడతను.

"ఒక సమాజం నిర్మించుకున్న సంస్కృతిలో అంతర్లీనంగా కొన్ని విలువలు వుంటాయి. ఎడమ చేతినే వాడటాన్ని ఈ సమాజం బలంగా సమర్థిస్తోందంటే అది ఎంతో మూలమైన విలువ అయ్యుండాలి. ఆ విలవ ఒక తరం నుంచి మరో తరానికి సంస్కృతిలో భాగంగా అందించబడుతోంది. అది ప్రతి రోజు ఆచరించి చూపించడం దగ్గర్నుంచి పిట్ట కథలలో, పాటలలో, పురాణాలలో ఇలా ఎన్నో రకాలుగా ఇది వుంటుంది. మనం కుడి చేతి వాటాన్ని సమర్థించేలా ఈ సమాజాన్ని మార్చాలి అంటే ఈ సంస్కృతిలో భాగంగా వున్న కథలను, పాటలను తిప్పి కొట్టాలి. కేవలం యుద్ధం చేసి మహాధినేతను ఓడించడం ద్వారా మనం అనుకున్నది సాధించలేము. అందుకని మీరంతా మీ మీ ప్రాంతాలలో తిరగండి. ఎడమ చేతిని సమర్థించే ఎలాంటి సాంస్కృతిక అంశమైనా, దాని గురించి క్షుణ్ణంగా తెలుసుకోండి. ముఖ్యంగా అది ఎప్పటి నుంచి వుందో, ఎలా మొదలైందో కనుక్కోండి. అలాంటి వివరాల మొత్తం నాకు చేరవేయండి. ముఖ్యంగా సాహిత్యం – కథలు, కవిత్వాలు వగైరాలు... అర్థం అయ్యిందా?" అన్నాడు చివరగా.

అందరూ అర్థమైందని ప్రకటించారు. సభ దాదాపు అయిపోతుందనంగా సుధాముడు పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"మహాబసూ" అంటూ అరిచాడు.

మహాబసు ముందు ఆశ్చర్యంగా చూసి, ఆ తరువాత తేరుకొని పరుగులాంటి నడకతో సుధాముడి దగ్గరకు చేరాడు. రక్తపు మరకలతో వున్న సుధాముణ్ణి చూడగానే అతని మనసు కీడు శంకించింది.

"ఏం జరిగింది సుధామా?" అన్నాడు.

"మహాబసూ.... నూటా ఇరవై ఆరు మంది మహాబసూ..."

"ఏమైంది?"

"నూటా ఇరవై ఆరు మంది స్వచ్ఛంద సత్యోద్యమకారులు... ఎవరూ మిగల్లేదు" కుప్పకూలిపోయాడు.

"ఏమంటున్నావ్? సత్యోద్యమకారులు చనిపోవటం ఏమిటి? ఎలా జరిగింది?" అడిగాడు మహాబసు.

"వామదేవుడు స్వయంగా వచ్చి తన కరవాలంతో తలలు నరికాడు" అంటూనే ఏడ్చేశాడు సుధాముడు. మహాబసు స్థబ్దుగా వుండిపోయాడు. ఆ తరువాత తేరుకోని అక్కడ్నుంచి వడివడిగా లేచి ఉద్యమస్థలి వైపు పరుగులాంటి నడకతో వెళ్ళిపోయాడు. వెనుక నుంచి ఎవరో నవ్వినట్లు వినపడ్డా పట్టించుకోలేదు అతను.

అతని మనసు అతలా కుతలం అయిపోయింది. సత్యోద్యమకారుల్ని చంపడం ఏమిటి? అని పదే పదే అనుకున్నాడు.

కొన్ని నెలల క్రితం అతను మహాబసుగా ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపించాలని అనుకున్నప్పుడు ధర్మం ఆధారంగా ఉద్యమం నడవాలని అదీ అహింసాయుతంగా, సత్యమైన ఆగ్రహాన్ని చూపించాలి అని ప్రకటించాడు. అతని ప్రకటన విన్న ఉద్యమకారులందరూ మొదట నిరాశచెందారు. అప్పటిదాకా, అవకాశం వచ్చినప్పుడల్లా శాస్త్రగ్రంధాలని నమ్ముకున్న మతాధిపతులను, మహాధినేత సైనికులను చంపేస్తూ తిరిగిన వారికి శాంతియుతంగా యుద్ధం ఎలా చెయ్యాలో అర్ధం కాలేదు. అర్ధం అయినవారికి అది ఆచరణీయంగా అనిపించలేదు.

ద్వీప, పశుపాల కలిసి భవిష్యజ్ఞాన గ్రంధంలో చెప్పబడిన మహాబసు ఇతనేనని పదే పదే ప్రచారం చేశారు. కొన్ని సందర్భాలలో స్వయంగా ఆచార్య వేదాంతమే మహాబసుతో తన సంఘీభావాన్ని ప్రకటించాడు. ఇవన్నీ క్రమంగా మహాబసుని నాయకుడిగా అంగీకరించడానికి దోహదపడ్డాయి. ఇందులో ఉగ్ర పాత్ర కూడా ప్రముఖంగా వుంది. అతని అనుచరులకు మహాబసుని సమర్ధించాల్సిన అవసరాన్ని ప్రత్యేకంగా చెప్పాడు. ఆయన ఆదేశాలను తన ఆదేశాలుగా అంగీకరించి, అవలంబించాలని చెప్పాడు. అది కేవలం నోటి మాటేనని, మహాబసుని పరీక్షించడానికే అలా చేస్తున్నాడని ద్వీప అభిప్రాయం. కారణం ఏమినప్పటికీ ఉగ్ర చెప్పడంతో అతని సైన్యం మహాబసు ఆదేశాలను అక్షరమక్షరం పాటించడానికి సిద్ధమయ్యారు.

అలాంటప్పుడు అతను చెప్పిన సత్యోద్యమ విధానం చాలామందికి కొంత ఆశ్చర్యకరంగానూ, అనూహ్యంగానూ అనిపించింది. అయినప్పటికీ ఆ విధానంలో ఉద్యమాన్ని కొనసాగించాలని వాళ్ళందరూ అంగీకరించారు. అప్పటినుంచి రక్తపాతాలు లేవు. హత్యలు లేవు. ప్రాణాలు హరించడాలు లేవు. కేవలం ప్రభుత్వ అధికారుల ముందు కుడి చేతితో పని చేస్తూ నిరసన ప్రకటించడం. ప్రభుత్వ పథకాలకి వ్యతిరేకంగా, సహాయ నిరాకరణ చేయటం. ఇది అత్యంత శాంతియుతంగా, ఏ ప్రాణ నష్టం లేకుండా జరుగుతోంది. కొంతమంది కొత్త సభ్యులు కూడా వచ్చి చేరారు. ఉద్యమం క్రమంగా రాజధాని నుంచి ఇతర చోట్లకు పాకుతోంది. ఇలాంటప్పుడు నూటా ఇరవై మంది సత్యోద్యమకారుల్ని మహాధినేత చంపడం ఉద్యమానికి గొడ్డలి పెట్టు కాగలదు. అందుకే మహాబసు స్వయంగా బయల్దేరాడు.

మహాబసు అక్కడికి చేరుకునేసరికి కొంత సమయం పట్టింది. కాలువలు కట్టిన రక్త ధారలను దాటుకుంటూ ముందుకు నడిచాడు. కొంత దూరం తరువాత దాటడానికి కూడా అవకాశం లేనంత వెడల్పుగా రక్తం పారుతోంది. ఆ రక్తంలోనే అడుగులు వేసుకుంటూ ముందుకు వెళ్ళాడు. చుట్టూ శవాలు. సైనికులవి, కొన్ని గుర్రాలవి, ఓ పది మంది ఆడవాళ్ళవి, ఒక చిన్న పిల్లాడిది..!!

మహాబసు కదిలిపోయాడు. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఒక నాయకుడిగా వీరందరినీ మృత్యువు వైపు నడిపించినందుకు బాధ్యత వహించాల్సిన అవసరం కూడా కనిపించింది. నాయకుడిగా కొనసాగడమా లేదా అన్న అనుమానం క్షణం పాటు మనసులో మెదిలింది.

"అహింసాయుతంగా పోరాడాలని ఒక్కళ్ళు కూడా ఎదురుతిరగలేదు మహాబసు" అన్నాడు పక్కనే నడుస్తున్న సుధామ. ఆ క్షణమే మహాబసు నాయకత్వాన్ని వదిలిపెట్టాలని నిర్ణయించుకున్నాడు.

"అదిగో మహాధినేత వామదేవుడు" అన్నాడు పశుపాల. మహాబసు అటువైపు చూశాడు.

అక్కడికి ఓ వంద అడుగుల దూరంలో ఉన్నాడతను. తలకాయలు నరకబడ్డ రెండు గుర్రాలను ఒకదాని మీద ఒకటి వేసి వాటిని ఆసనంలా భావించి, వాటి పైన కూర్చొని వున్నాడు. ఆరడుగులు పైనే వుంటాడు. వంటికి వేసుకున్న నల్లటి కవచం ధగధగా మెరుస్తోంది. ఎడమ చేతిలో రక్తమోడుతున్న కత్తిని కిందకు దించి పట్టుకున్నాడు. దాని కొన అతని కింద వున్న గుర్రం శరీరంలో కొద్దిగా దిగబడి వుంది. ఆ కత్తిని చిన్నగా తిప్పుతుండటంతో అది తెల్లటి వెలుగును నలువైపులా ప్రసరిస్తోంది.

మహాబసు అతని దగ్గరగా వచ్చేదాకా మహాధినేత గట్టిగా నవ్వుతూనే వున్నాడు. అతనితోపాటు అతని పక్కనే వున్న దళాధిపతి, ఇతర సైనికులు కూడా చిరునవ్వులు నవ్వుతూ తమ విజయాన్ని ఆస్వాదిస్తున్నారు. మహాబసు దగ్గరకు రాగానే మహాధినేత లేచి నిలబడ్డాడు.

"మ.. హా.. బ... సు..." అని ఒక్కో అక్షరాన్ని పలుకుతూ ఒక్కో అడుగు వేసి మహాబసు దగ్గరకు వచ్చాడు. ఆ తరువాత మహాబసు చుట్టూ తిరుగుతూ మాట్లాడసాగాడు.

"నువ్వు వస్తావు వస్తావు అని మా తాత ఎదురు చూశాడు, మా నాన్న ఎదురుచూశాడు. నేను ఎదురుచూశాను.... ఇన్నాళ్ళకు భవిష్యజ్ఞానగ్రంథంలో వున్నది నిజమౌతోందన్నమాట..!! నువ్వు వస్తే ఉద్యమాలు జరుగుతాయనీ, పోరాటాలు తప్పవని మా వంశం మొత్తం నిన్ను ఎదుర్కొనేందుకు సిద్ధపడుతూ రకరకాల యుద్ధ విద్యలు నేర్చుకుంటూ గడిపింది. ఇప్పుడు చూస్తే నువ్వు చేస్తున్నదేమిటి? సత్యోద్యమమా.." అంటూ గట్టిగా నవ్వాడు. సరిగ్గా మహాబసు ముందు వచ్చి నిలబడ్డాడు.

"అహింసాయుతంగా పోరాటం చేస్తావా?" అంటూ నవ్వాడు. "నేను ఇప్పుడు నిన్ను చంపేస్తుంటే నీ అహింస అహింసగానే వుంటుందా లేక హింసగా మారుతుందా?" అంటూ మళ్ళీ నవ్వాడు.

వామదేవుడు నవ్వుతూనే ఉన్నట్టుండి తన ఎడమ చేతిని పైకెత్తి కత్తిని మహాబసు మెడ మీదకు విసిరాడు. క్షణంలో వెయ్యోవంతు సమయంలో జరిగింది అర్థం చేసుకున్న మహాబసు చటుక్కున పక్కకు తప్పుకున్నాడు. కత్తి మొన దాదాపు అతని మెడని తాకినంత దగ్గరగా వెళ్ళింది. మహాబసుని దాటిని ఎడమచేయి వల్ల వామదేవుడు కుడివైపుకి వంగిపోయాడు. కానీ, మహాబసు తేరుకునే లోగా వామదేవుడు మళ్ళీ లేచి నిలబడే ప్రయత్నం చేస్తూ అదే అదనుగా కత్తి పిడితో మహాబసు తలపైన మోదాడు. మహాబసు స్పృహ తప్పి కిందపడిపోయాడు.

ఎక్కడో వైష్ణవ జనతో తేనే కహియేజే పీడ్ పరాయీ జానేరే అన్న పాట అతనికి లీలగా వినిపించసాగింది.

(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)

COMMENTS